సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం : 30 : జూన్ : 2023



పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు

వర్షాలు సమృద్ధిగా కురవాలంటూ పెద్దమ్మ తల్లి ఆలయంలో గురువారం 108 కలశాలు ప్రతిష్ఠించి గణపతి పూజ చేశారు. 8లో



రాకపోకలకు బేఫికర్

గుమ్మడవల్లి- వడ్డెర రంగాపురం గ్రామాల మధ్య పెదవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణంతో రాకపోకలకు ఇబ్బందులు తీరాయి. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 26°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రత అధికంగానే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో గురువారం తొలి ఏకాదశి, పెరియాళ్వార్ తిరునక్షత్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. ఆ తర్వాత ఆళ్వార్‌కు స్నపన తిరుమంజనం, తిరువీధి, చుట్టు సేవలను జరిపారు. తొలి ఏకాదశి కావడంతో భక్తులు స్వామివారి దర్శనానికి బారులుదీరారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను బేడా మండపంలో వేంచేపు చేసి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, జూలై 3వ తేదీన దమ్మక్క సేవా యాత్ర, గోవిందరాజ స్వామి కల్యాణం నిర్వహణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి గిరిజనులను ఆలయానికి తీసుకొచ్చేందుకు ఆర్టీసీ బస్సులను సిద్ధం చేస్తున్నారు.

శాశ్వత నిత్యాన్నదానం, గోశాలకు విరాళం..

భద్రాచలం: భద్రాద్రి రామాలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి, ఏపీలోని పురుషోత్తపట్నం గ్రామంలో నిర్మిస్తున్న గోశాలకు వరంగల్‌కు చెందిన పాలకుర్తి వంశీకృష్ణ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గురువారం రూ.3 లక్షలు విరాళంగా సమర్పించారు. ఆలయ ఏఈఓ భవాని రామకృష్ణ దాతలకు రశీదు అందించారు. కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు, ఆలయఅర్చకులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచరూరల్ : జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలల్లో పార్ట్‌టైం లెక్చరర్లు, టీచర్ పోస్టుల భర్తీకి ఈ నెల 30 నుంచి జూలై 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పీజీ, బీఈడీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. జూనియర్ లెక్చరర్ తెలుగు 1, ఇంగ్లిష్ 2, జువాలజీ 1, బోటనీ 2, గణితం 2, ఆర్థిక శాస్త్రం 2, భౌతికశాస్త్రం 1, పీడీ 1 పోస్టుతో పాటు పాఠశాలల్లో తెలుగు 1,ఇంగ్లిష్ 2, భౌతికశాస్త్రము 2, గణితం 2, సాంఘిక శాస్త్రం 1, పీఈటీ 2 పోస్టులు ఖాళీలు ఉన్నాయని వివరించారు. వివరాలకు 97045 50206 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.


భద్రాద్రి నుంచి షిర్డీకి రేపు ప్రత్యేక బస్సు

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం నుంచి గురుపౌర్ణమి సందర్భంగా షిర్డీకి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ బి.రామారావు తెలిపారు. ఈ బస్సు శనివారం రాత్రి 10 గంటలకు బయలుదేరి, తిరిగి 4వ తేదీ రాత్రి 10 గంటలకు భద్రాచలం చేరుకుంటుందని పేర్కొన్నారు. టికెట్ ధర రూ.4 వేలుగా నిర్ణయించగా, ఆన్‌లైన్ ద్వారా టికెట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ సదుపాయాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

డిమాండ్ ఉన్న పంటలే సాగు చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న రైతులకు సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత వాతావరణ మార్పులు, పరిస్థితులు, ఆరోగ్య సంరక్షణ, డెంగీ, కరోనా, పలు వైరస్‌ల వలన కలిగే అనారోగ్య లక్షణాల నుంచి సంరక్షణకు, రోగనిరోధక శక్తి పెంపుదలకు డ్రాగన్ ఫ్రూట్, జామ, నిమ్మ, పైనాపిల్ తదితర పంటలు సాగుచేయాలని సూచించారు. అంతర పంటలుగా పలు ఆకుకూరలు, బీర, సొర, కాకర, చిక్కుడు, టమాట, పచ్చిమిర్చి వంటివి కూడా సాగు చేసుకోవచ్చని వివరించారు. ప్రభుత్వం ద్వారా పలు పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్‌పామ్ తోటలు సాగుచేసి అన్ని రకాల పంటలను అంతర పంటలుగా కూడా సాగు చేయవచ్చని పేర్కొన్నారు.





వేడుకగా 'తొలి' పూజలు

9లో

తొలి ఏకాదశి సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తారు. పలువురు ఉపవాస దీక్షలు ఆచరించారు. తొలి ఏకాదశి అత్యంత పవిత్రమైనదని, ఈ రోజున ఏ కార్యక్రమం తలపెట్టినా నిర్విఘ్నంగా సాగుతుందని ఈ సందర్భంగా పండితులు తెలిపారు. కాగా, పలు ఆలయాల్లో సత్యనారాయణస్వామి వ్రతాలు కూడా ఆచరించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాలు, మసీదులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రవక్త ఇబ్రహీం త్యాగాలను మననం చేసుకున్నారు. ముస్లిం మత పెద్దలు సందేశం ఇవ్వగా, చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు అన్న, వస్త్ర దానాలు చేశారు. సర్వమానవ సమానత్వానికి ఈ పండుగ ప్రతీకగా మత పెద్దలు వివరించారు.

ఏళ్ల కల సాకారం..



పట్టాల పంపిణీ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులు

పోడు రైతులకు నేడు పట్టాల పంపిణీ

- హాజరుకానున్న మంత్రులు హరీశ్‌రావు, అజయ్‌కుమార్
- జిల్లాలో 50,595 మందికి లబ్ధి
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

చుంచుపల్లి: అనేక ఏళ్లుగా ఎదురుచూస్తున్న పోడు రైతుల చిరకాల స్వప్నం సాకారం కానుంది. శుక్రవారం నుంచి పోడు సాగుదారులకు పట్టాలు అందించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు జిల్లా అధికారులు పాల్వంచ సుగుణ గార్డెన్స్‌లో పోడు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హాజరై పోడు రైతులకు పట్టాలు అందించనున్నారు. ఇందుకోసం ప్రతి నియోజకవర్గం నుంచి 500 మంది లబ్ధిదారులు హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. మిగితా రైతులకు శనివారం నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో పట్టాల పంపిణీ ఉంటుంది. హక్కు పట్టాలతో పాటు పాస్ పుస్తకాలు కూడా అందించేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 1,51,195 ఎకరాల పోడు భూములకు సంబంధించి 50,595 మంది రైతులకు పట్టాలు అందజేస్తారు. వారికి ఈ వానాకాలం నుంచే రైతు బంధు, రైతు బీమా పథకాలను సైతం వర్తింపజేస్తారు. పోడు సమస్యను పరిష్కరించేందుకు 2021లో సాగుదారుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. అనంతరం ఎఫ్‌ఆర్‌సీ కమిటీలతో గతేడాది అక్టోబర్‌లో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి 50,595 మంది గిరిజన రైతులను అర్హులుగా గుర్తిస్తూ జిల్లా స్థాయి కమిటీకి పంపారు. జాబితాను పరిశీలించిన జిల్లా కమిటీ ఆమోదం తెలిపింది.

గిరిజనేతరులకు నిరాశే..

జిల్లాలో 313 గ్రామపంచాయతీల్లోని 717 ఆవాస గ్రామాల పరిధిలో పోడు భూములు సాగులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 2021లో జిల్లా వ్యాప్తంగా పోడు పట్టాల కోసం దరఖాస్తులు స్వీకరించగా 83,341 వచ్చాయి. వాటి పరిధిలో 2.97 లక్షల ఎకరాల భూములు సాగులో ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఆయా దరఖాస్తుల ప్రకారం 65,616 మంది గిరిజనులు 2,41,102 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు గుర్తించారు. వీటిలో పలు కారణాలతో 15,021 అప్లికేషన్లను తిరస్కరించి 50,595 దరఖాస్తులకు మాత్రమే జిల్లా కమిటీ (డీఎల్సీ) ఆమోదం తెలిపింది. జిల్లా వ్యాప్తంగా గిరిజనేతరులు, అటవీ భూములపై ఆధారపడిన ఇతర వర్గాల వారు అందజేసిన పత్రాలను ఎఫ్‌ఆర్సీ, రెవెన్యూ, అటవీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటవీ హక్కుల చట్టం - 2005 ప్రకారం గిరిజనేతరులు పోడు భూములపై హక్కు పొందాలంటే మూడు తరాలుగా అటవీ ప్రాంతాల్లో నివసిస్తూ ఉండాలి. ఒక తరాన్ని 25 ఏళ్లుగా పరిగణనలోకి తీసుకుంటే, 2005కు ముందు 75 ఏళ్లుగా అక్కడే ఉంటున్నట్లు ఆధారాలు చూపాలని అటవీ హక్కుల కమిటీలు కోరుతున్నాయి. అవి వచ్చేంత వరకు 17,725 మంది గిరిజనేతరుల దరఖాస్తులను పెండింగ్ పెట్టాలని జిల్లా కమిటీ నిర్ణయించింది. దీంతో ఏళ్లుగా పోడు పట్టాల కోసం నిరీక్షిస్తున్న గిరజనేతరులు నిరాశకు లోనయ్యారు.



పట్టాల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

పాల్వంచ: పోడు పట్టాలు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. పట్టణంలోని సుగుణా గార్డెన్స్‌లో పట్టాల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. నియోజక వర్గానికి 500 చొప్పున మొత్తం 2,500 మంది లబ్ధిదారులకు పోడు పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులను తరలించేందుకు పక్కా ప్రణాళికలు తయారు చేయాలని తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపిపిలు, కార్యదర్శులు హాజరయ్యేలా చూడాలని జెడ్పీ సీఈఓ విద్యాలతకు సూచించారు. ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలని ఉద్యానవన అధికారిని ఆదేశించారు. భోజనాల వద్ద రద్దీ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఐడీఓసీలో హెలికాప్టర్ ల్యాండింగ్‌కు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్‌బీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, డీపీఓ రమాకాంత్, డీసీఓ వెంకటేశ్వర్లు, మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, డీఆర్‌ఓ అశోక్ చక్రవర్తి, ఏఓ గన్యా, ఆర్అండ్‌బీ డీఈ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, తహసీల్దార్ రంగాప్రసాద్ పాల్గొన్నారు.

పాలేరు ప్రజలు పోరాటయోధులు



పాదయాత్రగా వస్తున్న భట్టి విక్రమార్క

- మీ ఓట్లు అమ్ముకున్న ఎమ్మెల్యేకు బుద్ధి చెప్పండి
- జనగర్జన సభతో సత్తా చాటాలి
- పీపుల్స్‌మార్చ్ యాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



చిరువ్యాపారుల సమస్యలు తెలుసుకుంటూ...

కూసుమంచి: పాలేరు నియోజకవర్గ ప్రజలు పోరాటయోధులే కాక త్యాగాలు చేశారని, ప్రజా సమస్యలపై కొట్లాడి నిలబడ్డారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా గురువారం కూసుమంచిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిచి మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించిన సంభాని చంద్రశేఖర్, రాంరెడ్డి వెంకటరెడ్డి, కత్తుల శాంతయ్య, పొట్టపింజర హుస్సేనయ్య తదితరులు ప్రజలను నమ్ముకున్నారు తప్ప వాళ్ల ఓట్లను అమ్ముకోలేదని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డిని కాంగ్రెస్ నుంచి గెలిపిస్తే వేల కోట్ల కాంట్రాక్టుల కోసం అమ్ముకుని పాలేరు ప్రజలు తలదించుకునేలా చేశాడని విమర్శించారు.

నాలుగు నెలలు ఆగండి...

ప్రస్తుత ఎమ్మెల్యే పాలేరు చరిత్రలో ద్రోహిగా మిగలడమే కాక పోలీసులను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ నాయకులపై కేసులు పెట్టిస్తున్నాడని భట్టి ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తల వెనుక ఎవరూ లేరని అనుకుంటున్నారని.. కానీ నాలుగు నెలలు ఆగితే వచ్చే తమ రాజ్యంలో ఎమ్మెల్యేను, ఆయన పార్టీని బంగాళాఖాతంలో కలుపుతామని హెచ్చరించారు. అధికార పార్టీకి దాసోహంగా మారిన ఇక్కడి ఏసీపీ ఎక్కడి నుండి వచ్చారో, ఆయన వెనుక ఎవరు ఉన్నారో తెలుసునని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, 2వ తేదీన తన పాదయాత్ర ముగింపు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరిక సందర్భంగా నిర్వహించే తెలంగాణ జనగర్జన సభకు రాహుల్‌గాంధీ హాజరవుతున్నారని భట్టి తెలిపారు. ఈ యాత్రకు పాలేరు నియోజకవర్గ ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. పాదయాత్రలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, జెడ్పీ మాజీ చైర్మన్ చందా లింగయ్య, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రాయల నాగేశ్వరరావు, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మట్టి గురవయ్య, కొల్లం వెంకటరెడ్డి, హఫీజ్, రాంరెడ్డి, వినోద, నాగరాజు, అంజని తదితరులు పాల్గొన్నారు. కాగా, రెండో రోజు యాత్ర పాలేరు నుండి మొదలై కూసుమంచి, కేశ్వాపురం, జీళ్లచెరువు, గోపాలరావుపేట మీదుగా ఖమ్మంరూరల్ మండలంలోని తల్లంపాడుకు చేరింది. యాత్రలో దారి పొడవునా రైతులు, కూలీలు, ప్రయాణికులను, చిరు వ్యాపారులను పలకరించి భట్టి వారి సమస్యలు తెలుసుకుని భరోసా కల్పించారు. ఇక పాదయాత్రలో వెన్నంటి నడిచిన నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పాశం నరేష్ రెడ్డిని భట్టి సన్మానించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ జేఏసీ అధ్యక్షుడు లోకేష్‌యాదవ్‌తో పాటు నాయకులు డాక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకు.. వెనుకకు!

- ఏటా లక్ష్యానికి దూరంగానే తునికాకు సేకరణ
- రెండు, మూడుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్ల నిరాసక్తత
- బీడీల అమ్మకం పడిపోవడమూ ఓ కారణమే!

సాక్షి, ఖమ్మం డెస్క్: వేసవిలో వ్యవసాయ పనులు లేక ఇక్కట్లు ఎదుర్కొనే గిరిజనులు, కూలీలను ఏటా తునికాకు సేకరణ ఆదుకునేది. దీంతో గిరిజనులు తునికాకు సేకరణను రెండో పంటగా భావించారు. కానీ ఇదంతా గతం! ఎందుకంటారా? పోడు సాగు పెరగడంతో తునికాకు చెట్లు తగ్గిపోవడం.. బీడీలు తయారుచేసే వారి సంఖ్య తగ్గడం, ఉపాధి హామీ పథకం అందుబాటులోకి రావడం వంటి కారణాలతో తునికాకు సేకరణపై అటు కాంట్రాక్టర్లు, ఇటు గిరిజనులు ఆసక్తి చూపక అటవీ శాఖ లక్ష్యం నెరవేరడం లేదు.

ఇల్లు కట్టి.. పెళ్లి చేసి...

వేసవి వస్తుందంటే అభయారణ్యం సమీప ప్రాంతాల్లో తునికాకు సేకరణ మొదలయ్యేది. కుటుంబమంతా ఉదయాన్నే అడవికి వెళ్లి ఆకు తీసుకొచ్చి కట్టలుగా కట్టి కల్లాల్లో అప్పగించేవారు. కుటుంబంలో ఐదారుగురు ఉంటే రోజుకు 500 పైగానే కట్టలు కట్టేవారు. ప్రస్తుతం కట్టకు రూ.3 వస్తుండగా ఒక్కో కుటుంబానికి రోజుకు రూ.1,500 నుంచి రూ.2వేల వరకు.. నెలకు రూ.50 వేల ఆదాయం సమకూరేది. దీంతో ఇల్లు కట్టుకోవడం, పిల్లల పెళ్లి చేసేందుకు ఉపయోగించుకునేవారు. కానీ ఇప్పుడు ఆ స్థాయిలో ఆకు లభ్యత లేదు. ప్రధానంగా పోడు వ్యవసాయంతో తునికాకు చెట్లు అంతరించిపోవడమే కారణంగా చెబుతున్నారు.

ఛత్తీస్‌గఢ్ వైపే కాంట్రాక్టర్ల మొగ్గు

ఛత్తీస్‌గఢ్‌తో పాటు మహారాష్ట్ర అటవీ ప్రాంతాల్లో తునికాకు ఎక్కువగా లభిస్తోంది. గతంలో తెలంగాణలోనూ అదే పరిస్థితి ఉన్నా రానురాను చెట్లు అంతరించిపోవడంతో అటవీ అధికారులు టెండర్లు ఆహ్వానిస్తే కాంట్రాక్టర్లు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర యూనిట్లు పూర్తయ్యాకే తెలంగాణ వైపు వస్తున్నారు. దీంతో ఏటా రెండు, మూడు సార్లు టెండర్లు ఆహ్వానించినా పూర్తి స్థాయిలో యూనిట్లు అమ్ముడవడం లేదు.

సేకరణ అంతంతే...

ఈ ఏడాది రాష్ట్రంలోని ఎనిమిది సర్కిళ్లలో పరిశీలిస్తే 2,27,800 స్టాండర్డ్ బ్యాగుల (ఒక్కో స్టాండర్డ్ బ్యాగులో 1000 తునికాకు కట్టలు, ఒక్కో కట్టలో 50 ఆకులు ఉంటాయి) తునికాకు సేకరించాలనేది లక్ష్యం. కానీ 60 శాతానికి మించలేదని అధికారిక సమాచారం. భద్రాద్రి జిల్లాలోని అటవీ డివిజన్లలో కలిపి 35,100 స్టాండర్డ్ బ్యాగుల ఆకు సేకరించాలనేది లక్ష్యం కాగా, 21వేల బ్యాగుల సేకరణే జరిగింది. మిగతా జిల్లాలు, సర్కిళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొనగా.. గత కొన్నేళ్లుగా అలాగే సాగుతోంది.

దూరం వెళ్లాల్సి వస్తోంది..



గతంలో మాదిరి తునికాకు దొరకడం లేదు. అప్పట్లో అడవిలో కాస్త దూరం వెళ్లగానే ఆకు కనిపించేది. ఇప్పుడు అడవి లోపలకు వెళ్లినా చెట్లు ఉండడం లేదు. రోజంతా కుటుంబం మొత్తం కష్టపడితే 100 కట్టలకు సరిపడా ఆకు దొరకడమే కష్టమవుతోంది. అందుకే ఎవరూ ఈ పనికి రావట్లేదు.

–మొక్కటి సుగుణ, రేగులగూడెం, పాల్వంచ మండలం

అకాల వర్షాలతో ఆలస్యం



మార్చి, ఏప్రిల్‌లో అకాల వర్షాలతో తునికాకు సేకరణ ఈ ఏడాది ఆలస్యమైంది. దీనికి తోడు ఆకు సేకరణ కూడా రకరకాల కారణాలతో తగ్గుతోంది. ఇందుకు పోడు సాగు ప్రధానమని చెప్పాలి. ఇక గిరిజనులు కూడా ఇతర పనులకు వెళ్తుండడంతో సేకరణపై ప్రభావం చూపిస్తోంది.

– కట్ట దామోదర్‌రెడ్డి, వైల్డ్ లైఫ్ ఎఫ్‌డీఓ, పాల్వంచ



ఇంట్లో తునికాకులను కట్టలుగా కడుతున్న కుటుంబం

రూపాయికే సిగరెట్ !

తునికాకును ప్రధానంగా బీడీల తయారీకే ఉపయోగిస్తుండగా.. బీడీల వాడకం తగ్గడం.. తయారు చేసే మహిళలు ఇతర పనుల్లో నిమగ్నం కావడంతో ఆ పరిశ్రమ కూడా అంతగా లాభాల్లో లేదు. వరంగల్ తదితర జిల్లాల్లో పరిశీలిస్తే పదుల సంఖ్యలో బీడీ పరిశ్రమలు ఉండేవి. అక్కడి వేలాది మంది మహిళలు బీడీల తయారీలో నిమగ్నమయ్యే వారు. కానీ మహిళా సంఘాలకు రుణాలు వస్తుండడం, బీడీ తయారీలో ఉపయోగించే పొగాకు కారణంగా అనారోగ్యం దరి చేరుతుండడంతో ఇతర పనుల్లోకి మళ్లారు. దీంతో ఒక్కో పరిశ్రమ నుంచి రోజుకు లారీ లోడ్ వెళ్లే బీడీలు ఇప్పుడు నెలకో లోడ్ కూడా వెళ్లే పరిస్థితి లేదు. ఒక కట్టలో 20 నుంచి 25 బీడీలు ఉంటుండగా.. దీని ధర రూ.20 పలుకుతోంది. కానీ రూ.1కే సిగరెట్ కూడా లభిస్తుండడంతో బీడీలు తాగేవారు ఇటు వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా బీడీల అమ్మకాలు పడిపోయి పరిశ్రమల నిర్వాహకులు నిరాసక్తత కనబరుస్తున్నారు.

క్లుప్తంగా

జనగర్జన సభను జయప్రదం చేయాలి

డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య


పొదెం వీరయ్య

భద్రాచలం: ఖమ్మం జిల్లా కేంద్రంలో జూలై 2న జరిగే కాంగ్రెస్ జనగర్జన సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య గురువారం ప్రకటనలో కోరారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరే ఈ సభకు జాతీయ కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ హాజరవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అమానుష పాలన సాగిస్తున్న కేసీఆర్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సభకు జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, వేలాదిగా తరలిరావాలని కోరారు.

సింగరేణిలో బదిలీలు, పోస్టింగ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పలువురు అధికారులకు స్థానచలనం కలిగింది. ఈమేరకు చీఫ్ సెక్యూరిటీ జీఎంగా విధులు నిర్వర్తిస్తున్న బి.హన్మంతరావును జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం)గా నియమించారు. అలాగే, ఐఆర్‌పీఎం వింగ్‌లో ఏజీఎం కవితానాయుడును చీఫ్ ఈఈ సెల్, సీఎస్పార్ జీఎంగా, ఈఈ సెల్ ఏజీఎం బీఆర్.దీక్షితులును జీఎం సెక్యూరిటీగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. వీరు నూతన స్థానాల్లో శనివారం విధుల్లో చేరాల్సి ఉంటుంది. అలాగే, సర్వే జీఎం సమ్మిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యాన ఏజీఎం రవిని జీఎంగా ఉద్యోన్నతి కల్పించారు. ఇంకా జీఎం(ఈ అండ్ ఎం) గోపాలకృష్ణమూర్తి కూడా ఉద్యోగ విరమణ చేయనుండడంతో వర్క్‌షాప్ ఎనర్జీ మేనేజ్‌మెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.నాగేశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

రామయ్యను దర్శించుకున్న ఎస్పీ


ఆలయంలో ఎస్పీ వినీత్ దంపతులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ఎస్పీ డాక్టర్ వినీత్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్న ఎస్పీ దంపతులకు పండితులు వేదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు విజయరాఘవన్, ఏఈఓ భవాని రామకృష్ణ పాల్గొన్నారు.

పాలేరులో కందాలే పోటీ చేస్తారు..

- నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా ఎంపీలు
- బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మధు

కూసుమంచి: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పాలేరు బరిలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డే ఉంటారని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వెల్లడించారు. కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోనే అత్యధిక ప్రజాబలం ఉన్న వ్యక్తిగా ఉపేందర్‌రెడ్డి పాలేరులో వచ్చే ఎన్నికల్లో పోటీలో ఉంటారని సీఎం కేసీఆర్ తనకు స్వయంగా చెప్పారని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఆయన గెలవటం తథ్యమని అన్నారు. ఇప్పటికే అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసేందుకు గాను ఎంపీలను ఇన్‌చార్జ్‌లుగా సీఎం నియమించారని తెలిపారు. మధిరకు నామా నాగేశ్వరరావు, సత్తుపల్లికి బండి పార్థసారధిరెడ్డి, కొత్తగూడెంకు వద్దిరాజు రవిచంద్రను నియమించగా, పాలేరు త్వరలో ఇన్‌చార్జిని ప్రకటిస్తారని పేర్కొన్నారు. ఎలాంటి బేధాభిప్రాయాలు ఉన్నా పక్కన బెట్టి పాలేరులో కందాళ గెలుపునకు కృషిచేయాలని మధు కోరారు.

ఇరువర్గాల ఘర్షణ

జూలూరుపాడు: పొలం గట్టు విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన భూక్యా కిషన్, భూక్యా జుమ్కీలాల్ మధ్య పొలం గట్టు విషయంలో వివాదం ఏర్పడింది. దీంతో గురువారం సమస్య పరిష్కారం కోసం గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ ఏర్పాటు చేశారు. పంచాయితీలో ఇరువర్గాల మధ్య మాటా మాట పెరిగి పరస్పర దాడులు చేసుకున్నారడు. దీంతో భూక్యా కిషన్ బావమరిది వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కాగా, జుమ్కీలాల్‌కు గాయాలయ్యాయి. పరస్పర దాడులతో అక్కడ ఉన్న గ్రామపెద్దలు భయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న జూలూరుపాడు ఎస్సై పోటు గణేష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, ఇరువర్గాలను చెదరగొట్టారు. గాయపడ్డ వెంకటేశ్వర్లు, జుమ్కీలాల్‌ను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,346

రాకపోకలకు బేఫికర్

- చివరి దశకు హైలెవల్ వంతెన నిర్మాణ పనులు
- గిరిజనులకు తీరనున్న పెదవాగు కష్టాలు


గుమ్మడవల్లి-వడ్డెర రంగాపురం గ్రామాల మధ్య పెదవాగుపై పూర్తయిన హైలెవల్ వంతెన

అశ్వారావుపేటరూరల్: పెదవాగుపై హైలెవల్ వంతెన లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో గిరిజన గ్రామాలకు రాకపోకలు స్తంభిస్తున్నాయి. మూడు దశాబ్దాలుగా గిరిజనుల ఎదుర్కొంటున్న కష్టాలను తొలగించేందుకు ప్రభుత్వం ఐదేళ్ల క్రితం వంతెన మంజూరు చేయగా, నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. మండలంలోని గుమ్మడవల్లి- వడ్డెర రంగాపురం గ్రామాల మధ్యలో పెదవాగుపై హైలెవల్ వంతెన లేదు. దీంతో వర్షాకాలం సీజన్‌లో వాగు ఉధృతంగా ప్రవహించి వాహనదారులు, ప్రయాణికులు, విద్యార్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వాగు ఉప్పొంగితే దాదాపు 12 గిరిజన గ్రామాలకు రాకపోకలకు స్తంభిస్తున్నాయి. బ్రిడ్జి నిర్మించాలని పలుమార్లు గిరిజన గ్రామాల ప్రజలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నారు. దీంతో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో 2017లో హై లెవల్ వంతెన నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరయ్యాయి. అదే ఏడాది డిసెంబర్ 13న నిర్మాణ పనులు ప్రారంభించారు. వివాదాల కారణంగా వంతెన నిర్మాణ పనుల్లో తీరని జాప్యం జరిగింది. పనులు పలుమార్లు నిలిచిపోయాయి. ఇదే విషయమై 'సాక్షి' దినపత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురించగా, స్పందించిన ఉన్నతాధికారులు రెండేళ్ల క్రితం పనులు వేగవంతం చేశారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం 95శాతానికి పైగా పూర్తి కాగా, రెండు వైపులా వాల్ రివిట్‌మెంట్ పనులు జరుగుతున్నాయి. వాగు ప్రవాహాన్ని పూర్తిగా వంతెన కింద నుంచే వెళ్లేలా ఫిల్లర్ల దగ్గర ఉన్న ఇసుక, మట్టి పూర్తిగా తొలగించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఆయాగ్రామాలకు రాకపోకలు సాఫీగా సాగనున్నాయి. దీంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి తొలి ఏకాదశి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారికి 108 కలశాలు ప్రతిష్ఠాపన చేసి గణపతి పూజ గావించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని కలశ పూజలు, గో పూజలు జరిపారు. జగన్నాథపురం, కేశవాపురం గ్రామాల భక్తులు నీళ్ల బిందెలు, కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు జరిపారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, పాలకవర్గ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులతోపాటు అర్చకులు, వేదపడింతులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

రామాలయంలో నేడు ముగ్గురి ఉద్యోగ విరమణ


మున్నంగి నాగేశ్వరరావు


షేక్ మౌలానా సాహెబ్


చెన్నకృష్ణమాచార్యులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ముఖ్య అర్చకులు అమరవాది చెన్నకృష్ణమాచార్యులు(రాజా), డోలు విద్వాంసులు మున్నంగి నాగేశ్వరరావు, నాదస్వర విద్వాంసులు షేక్ మౌలానా సాహెబ్ శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఎన్నో సంవత్సరాలుగా వీరు స్వామివారికి జరిగే సేవల్లో పాల్గొంటూ భక్తుల మన్ననలు అందుకున్నారు. శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలతో పాటుగా అనేక వేడుకల్లో సేవలందించారు. వీరిని జూలై 1న ఘనంగా సత్కరించేందుకు అర్చకులు, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. వీరితో పాటుగా ఉప ప్రధాన అర్చకులుగా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉప ప్రధానార్చకులు పొడిచేటి సత్యనారాయణాచార్యులు దంపతులను సైతం సత్కరించనున్నారు.

విద్వాంసుల నియామకం తప్పనిసరి

కాగా సీతారామ చంద్రస్వామి ఆలయంలో నాదస్వరానికి ఇద్దరు, డోలుకు ఇద్దరు, తాళానికి ఇద్దరు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో ఓ నాదస్వరం విద్వాంసుడు అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌లో ఉన్నాడు. ఇప్పుడు ఇద్దరు విద్వాంసులు ఉద్యోగ విరమణ చేస్తే ముగ్గురు మాత్రమే ఉంటారు. ఇందులో నాదస్వర విద్వాంసులు ఒక్కరూ లేరు. వెంటనే శాశ్వత ప్రాతిపాదికన లేదా డిప్యూటేషన్‌పై సదరు పోస్టులను భర్తీ చేయాలని భక్తులు కోరుతున్నారు.

కార్ల గ్లాసులకు బ్లాక్ కవర్ల తొలగింపు


కారు గ్లాస్‌కు ఉన్న బ్లాక్ కవర్‌ను తీయిస్తున్న సీఐ కరుణాకర్

కొత్తగూడెంటౌన్: వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఏరియా పరిధిలోని కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో గురువారం సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. కార్ల అద్దాలకు ఉన్న బ్లాక్ కవర్లను తొలగించారు. నంబరు ప్లేట్లు, సరైన ధ్రువపత్రాలు లేకుండా తిరుగుతున్న సుమారు 100 ద్విచక్ర, కార్లు, ఆటోలను పట్టుకుని, వాహన యజమానులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ కరుణాకర్ మాట్లాడుతూ కార్ల అద్దాలకు బ్లాక్ కవర్లు ఏర్పాటు చేయొద్దని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలను నడిపితే జైలుశిక్ష తప్పదని పేర్కొన్నారు. ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని, రాంగ్ రూట్‌లో వెళ్లొద్దని, మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని సూచించారు. తోటి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాల నివారణకు తోడ్పడాలని చెప్పారు.

మావోయిస్టు కొరియర్ అరెస్ట్

- రూ.6.20 లక్షల నగదు స్వాధీనం
- కరెన్సీ మొత్తం రద్దయిన రూ.2 వేల నోట్లే..

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులకు సంబంధించిన రద్దయిన రూ.2 వేల నోట్లను బ్యాంకులో జమ చేసేందుకు తీసుకొస్తున్న వ్యక్తిని ఆవుపల్లి సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మావోయిస్టు పార్టీ బాసగూడ ఎల్‌ఓఎస్ కమాండర్ శంకర్, నేంద్ర ఆర్‌పీసీ ప్రెసిడెంట్ హడ్మా కుహ్రామి ఆదేశాల మేరకు మహేష్ బాడ్సే అనే వ్యక్తి రద్దయిన రూ.2 వేల నోట్లను తీసుకొస్తున్నాడనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఆవుపల్లి పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 229 బెటాలియన్ పోలీసులు ఆవుపల్లి సమీపంలోని ప్రధాన రహదారిపై నిఘా పెట్టారు. ద్విచక్రవాహనంపై వస్తున్న మహేష్ బాడ్సేను అదుపులోకి తీసుకుని తనిఖీలు చేయగా రద్దయిన రూ.2 వేల నోట్లు కనిపించాయి. విచారణలో పూర్తి వివరాలు వెల్లడించాడు. మొత్తం రూ. 9 లక్షల నగదు ఇచ్చి మావోయిస్టులు పంపినట్లు, అందులో రూ.1.80 లక్షలు ఆవుపల్లిలోని ఐసీఐసీఐ బ్యాంకులో జమ చేసినట్లు వివరించాడు. రూ. లక్ష ఇతర అవసరాలకు వాడాలని, మిగిలిన రూ.6.20 లక్షలను మళ్లీ బ్యాంకులో జమ చేయాలని మావోయిస్టులు సూచించినట్లు మహేష్ తెలిపాడు. నిందితుడిని అరెస్ట్ చేసి బీజాపూర్ జిల్లా కోర్టులో రిమాండ్ చేసినట్లు అక్కడి పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఒకరికి తీవ్ర గాయాలు

బూర్గంపాడు: మండల పరిధిలోని అంజనాపురం గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అంజనాపురం గ్రామానికి చెందిన బోడా శ్రీనివాస్ ద్విచక్రవాహనంపై మోరంపల్లి బంజర వైపు వెళ్తున్న క్రమంలో భద్రాచలం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతనిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి..

చెట్టును ఢీకొని యువకుడి మృతి


పవన్ కల్యాణ్ (ఫైల్)

టేకులపల్లి: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని తుమ్మలచెలక సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ప్రెగళ్లపాడు పంచాయతీ పడమటిగుంపునకు చెందిన వాసం జోగయ్య, బుచ్చమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. వీరిది నిరుపేద వ్యవసాయ కుటుంబం. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెకు వివాహాలు కావాల్సి ఉంది. కొన్నేళ్ల క్రితమే జోగయ్య మృతి చెందాడు. చివరి సంతానం వాసం పవన్ కల్యాణ్(23) బుధవారం సాయంత్రం పెట్రాంచెలక గ్రామంలోని తన అక్క ఈసం కౌసల్య ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. రాత్రి వరకు అక్కడే ఉండి భోజనం చేసి 11 గంటల తర్వాత బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో తుమ్మలచెలక సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద బైక్ అదుపుతప్పి అతి వేగంగా వెళ్లి చెట్టుని ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపై పవన్ కల్యాణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి సోదరుడు వీరస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి అదృశ్యం


బాలుడు విష్ణువర్ధన్

అన్నపురెడ్డిపల్లి: బాలుడి అదృశ్యంపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పెంట్లం గ్రామానికి చెందిన తాటి విష్ణువర్ధన్ దమ్మపేట మండలం పార్కలగండి ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో హోమ్‌సిక్ సెలవులు ఇవ్వడంతో ఈ నెల 24న ఇంటికి వచ్చాడు. బుధవారం సాయంత్రం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లేదు. బాలుడి తండ్రి తాటి సురేష్ ఫిర్యాదు మేరకు ఎస్సై షాహీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోశాలకు పశువుల అప్పగింత


గోశాలకు తరలించిన పశువులు

ఇల్లెందు/పాల్వంచ: ఇల్లెందు మీదుగా ఖమ్మానికి ఓ వాహనంలో గురువారం అక్రమంగా పశువులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వెంకటాయపాలేనికి చెందిన డి.నాగేశ్వరరావు అనే వ్యక్తి ఓ కొమరారం నుంచి వాహనంలో 16 పశువులు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఇ.రాజేష్ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి పశువులను పాల్వంచలోని గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

పోక్సో కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: మైనర్ బాలికను తల్లిని చేసి వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై పోలీసులు గురువారం పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్సై రాజేష్ కుమార్ కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని ఓ కాలనీకి చెందిన పదహారేళ్ల బాలికకు దమ్మపేట మండలం గట్టుగూడెం గ్రామానికి చెందిన వివాహితుడైన విజయసాయిరెడ్డి మాయమాటలు చెప్పి రెండేళ్లుగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. దీంతో బాలిక గర్భం దాల్చి ఏడాది క్రితం బాబుకు జన్మనిచ్చింది. కాగా కొంతకాలం నుంచి బాలికను విజయసాయిరెడ్డి వేధింపులకు గురిచేస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి వేధించడంతో భరించలేని ఆమె అర్ధరాత్రి సమయంలోనే పోలీసులను ఆశ్రయించింది. కాగా ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాధిత తల్లి బిడ్డలను సంరక్షణ కోసం కొత్తగూడెంలోని శిశుసంరక్షణ కేంద్రానికి తరలించినట్లు పేర్కొన్నారు.

బతుకుదెరువే మృత్యువై..

చెట్టు కొమ్మ కోస్తుండగా మీద పడి వ్యక్తి మృతి


వెంకన్న మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గుండాల: చెట్టును కోస్తుండగా కొమ్మలు విరిగిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కాలం వెంకన్న(38) చెట్లను కొనుగోలు చేసి, విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఓ రైతు చేలో ఇటీవల గాలిదుమారానికి చెట్లు కొన్ని విరిగిపోగా, మరికొన్ని వంగిపోయాయి. శుక్రవారం ఆ చేలో కొమ్మలను తొలగిస్తుండగా అప్పటికే ఆ చెట్టుపై విరిగి ఆనుకుని ఉన్న కొమ్మ ఒక్కసారిగా మీద పడింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా రోదిస్తోంది. కాగా మృతుడు బీఆర్ఎస్ పార్టీలో పనిచేస్తున్నాడు. పలువురు నాయకులు వెంకన్న మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆటో, ముగ్గురికి గాయాలు

కొణిజర్ల: కట్టెల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనక నుంచి ఆటో ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని సింగరాయపాలెంకు చెందిన చిరంజీవి తన ఆటోలో ఖమ్మం నుంచి ఇద్దరిని తీసుకుని వైరా వస్తుండగా పల్లిపాడు వద్ద కట్టెల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆటో ముందు భాగం దెబ్బతిని చిరంజీవి గాయపడ్డాడు. అలాగే, ఆటోలో ప్రయాణిస్తున్న ఖమ్మం టేకులపల్లికి చెందిన రాములమ్మ, వెంకమ్మకు సైతం స్వల్పగాయాలయ్యాయి. వీరిని 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గొత్తికోయలను మోసం చేసిన ఘటనలో..

అశ్వారావుపేటరూరల్: పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తానని గొత్తికోయలను మోసం చేసిన వ్యక్తిపై గురువారం కేసు నమోదైంది. ఎస్సై రాజేష్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని రమణక్కపేట అటవీ ప్రాంతంలో 12 మంది గొత్తికోయలు నివాసాలు ఏర్పాటు చేసుకుని పోడు భూములు సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో భూములకు పట్టాలు ఇప్పిస్తానని దమ్మపేట మండలం సరోజినీపురం గ్రామానికి చెందిన మద్దిశెట్టి సామ్యూల్ కొద్ది రోజుల క్రితం రూ.2.6 లక్షలు వసూలు చేశాడు. బాధితుల్లో ఒకరైన ఊకే సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

అటు సేవ.. ఇటు భరోసా

- జాబ్‌మేళాలు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయిస్తున్న డీహెచ్ గడల
- పలువురు నిరుద్యోగులకు ఉపాధి కల్పన
- తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


గ్రంథాలయంలో ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం (ఫైల్)


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కొత్తగూడెంరూరల్: కరోనా సమయంలో ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించిన అధికారిగా పేరు తెచ్చుకున్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు జీఎస్సార్ ట్రస్ట్ పేరుతోనూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తన సొంత నియోజకవర్గమైన కొత్తగూడెం ప్రాంతంలో పలువురు పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స చేయిస్తున్నారు. సుమారు 130 మందికి శస్త్ర చికిత్సలు, ముగ్గురికి అవయవ మార్పిడి చేయించి ఆదుకున్నారు. యువతకు చేదోడు వాదోడుగా నిలిచేందుకు గత జనవరి 7న కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించి 3,200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ..

మహిళలను ప్రోత్సహించేందుకు వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారిని గుర్తించి సన్మానిస్తున్నారు. భద్రాచలంలో కాటికాపరిగా పనిచేస్తున్న అరుణ, ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు పొందిన ఏఎన్ఎం సుశీల, సుజాతనగర్‌లో వాహనాల టైర్లకు పంక్చర్ వేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న కనకదుర్గ, ఆటో డ్రైవర్ జెరీనా వంటి మహిళలకు గ్రామికరత్న అవార్డులు అందజేశారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు యువశక్తి పేరుతో శిక్షణ తరగతులు ఇప్పించారు. ఇంకా అనేక సందర్భాల్లో మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి చీరలు, కుట్టుమిషన్లు, ఇతర బహుమతులు అందించి ప్రోత్సహించారు. ఉచిత మొబైల్ హెల్త్ క్లినికల్ వాహనాలు ఏర్పాటు చేసి జనరల్ ఫిజీషియన్, గైనకాలజీ, ఫార్మసిస్ట్, ల్యాబ్, ఎక్స్‌రే టెక్నీషియన్ల ద్వారా అవసరమైన వారికి వైద్య చికిత్సలు అందించారు. జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఉచితంగా నెట్ సౌకర్యం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. బస్టాండ్ సెంటర్‌లో తాగునీటి ఎద్దడి నివారణకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతో పాటు పలు గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేశారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ఉల్వనూరు, గంగదేవిగుప్ప, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, చుంచుపల్లిలో వాలీబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సైతం సహకారం అందిస్తున్నారు. భవిష్యత్‌లోనూ పేద, మధ్యతరగతి వర్గాలకు తమ ట్రస్ట్ ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామని శ్రీనివాసరావు చెప్పారు.

ఇల్లెందులో 117 శాతం ఉత్పత్తి

బొగ్గు వెలికితీతలో అగ్రస్థానం



వివరాలు వెల్లడిస్తున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు ఏరియా అగ్రస్థానంలో ఉందని ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. ఇటీవల నూతన జీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జూన్ నెలలో 2.15 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటికే 2.52 లక్షల టన్నుల బొగ్గు వెలికి తీసి 117 శాతం నమోదు చేసినట్లు తెలిపారు. 1.35 లక్షల టన్నులు బొగ్గు రైలు మార్గం ద్వారా, 0.29 లక్షల టన్నులు రోడ్డు మార్గం ద్వారా, ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 1.12 లక్షల టన్నులు బొగ్గు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. ఏరియాను అగ్రస్థానంలో ఉద్యోగులను, సూపర్‌వైజర్లను అధికారులను, యూనియన్ నాయకులను అభినందించారు. జేకేఓసీ విస్తరణ ప్రక్రియ పురోగతిలో ఉందని తెలిపారు. ఓబీ వెలికితీసేందుకు అవసరమైన రోడ్ మార్గంలో బ్రిడ్జిల నిర్మాణం సాగుతోందన్నారు. రైల్వే లెవల్ క్రాసింగ్ కోసం అనుమతి లభించిందన్నారు. ఓసీ విస్తరణలో ప్రభుత్వ భూమి అనుమతి కూడా ఈ నెలలో లభిస్తుందని తెలిపారు. అధికారులు మల్లారపు మల్లయ్య, శ్రీనివాస్, గిరిధర్‌రావు, జీవీ మోహన్‌రావు, జి. శ్రీహరి తదితరులు ఉన్నారు.

సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో డీసీసీబీ చైర్మన్, వైరా ఎమ్మెల్యే

ఖమ్మంమయూరిసెంటర్: ఎవరు ఎన్నిక కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవడం, సీఎంగా కేసీఆర్ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం పేర్కొన్నారు. బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సిఫారసుతో వైరా, అశ్వారావుపేట, మధిర, పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాలకు చెందిన 57 మందికి మంజూరైన రూ.22,51,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో వారు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నామా ఎంపీగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే నామ ముత్తయ్య ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, వైరా జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గతో పాటు నాయకులు బాణాల వెంకటేశ్వరరావు, చిరంజీవి, చేబ్రోలు మల్లికార్జునరావు, పోట్ల శ్రీనివాసరావు, చెరుకుమల్లి రవి, మాధవరావు, తన్నీరు రవికుమార్, బంధం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

